ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి...

- కలెక్టరేట్ ఎదుట ఐద్వా ధర్నా

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

బిజెపి ఎంపీ బ్రిజుభూషన్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ చరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు పి.నిర్మల, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు మాట్లాడుతూ దేశంలో రెజ్లింగ్ క్రీడలో ఒలింపిక్ మెడల్స్ సంపాదించి దేశ ప్రతిష్టను, దేశంలోనూ విదేశాలలోనూ సత్తా చాటి దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిన మహిళ రెజ్లర్లు తమ మీద లైంగిక దాడులకు గురి చేస్తూ అవమానపరుస్తున్న బ్రీజ్ భూషణ్ చరణ్ సింగ్ మీద ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అత్యాచార కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని గత 40 రోజులుగా మహిళా రెజ్లర్లు ఢిల్లీ నడిబొడ్డున ఆందోళనకు కూర్చుంటే ప్రధానిమంత్రి, కేంద్రమంత్రులు పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమని విమర్శించారు. ఈ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, నరేంద్ర మోడీ చెప్పిన బేటి బచావో బేటి పడావో అనే నినాదం కేవలం నోటి మాట వరకే పరిమితమైందని, ఆచరణలో అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. 40 రోజులు అవుతున్న లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ దర్జాగా బయట తిరుగుతున్నారని అన్నారు. పోలీసులు ఆయనను అరెస్టు చేయడం లేదంటే ఈ దేశంలో చట్టం ఎలా పని చేస్తుందో , ఎవరికోసం పని చేస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. సాధారణ ప్రజలకు ఒక న్యాయం, బిజెపి ఎంపీ ఎమ్మెల్యేలు ఎవరు తప్పులు చేసినా ఎలాంటి కేసులు పెట్టకుండా వారికి ఇంకో విధమైన న్యాయం చేస్తుందన్నారు. తక్షణమే మోడీ ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ పై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి తక్షణమే రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా న్యూ సిటీ అధ్యక్షులు ధనలక్ష్మి, ఓల్డ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, రషీదా, జిల్లా నాయకురాలు పద్మ, సుజాత, శ్యామల, అమీనా,నగర నాయకురాలు షబానా, రుద్రమ్మ,కృష్ణవేణి ఖ్రమూన్ బి, అనసూయ, బాలలక్ష్మి, రేవతి, కుమారి బద్రున్నిసా, పర్వీన్, లక్ష్మీ, రేణుక, సరితా,లక్ష్మీదేవిలి పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

'అడ్వాన్స్' దోపిడీ

- సీటు కోసం నాన్ రీఫండబుల్ వసూలు - సామాన్యులను దోచేస్తున్న కార్పొరేట్ కళాశాలలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కార్పొరేట్ కళాశాలలను సామాన్యులను వివిధ రూపాల్లో దోచేస్తున్నాయి. సీటు రిజర్వ్ చేసుకోవడానికి అంటూ అడ్వాన్స్ పేరుతో నాన్ రీఫండబుల్ సొమ్మును వసూలు చేస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి...

నిన్న మొన్నటి వరకూ ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడిన కార్పొరేట్ కళాశాలలు వసూలు కోసం మరో మార్గాన్ని ఎంచుకున్నాయి. సీటు బుక్ చేసుకోవడం కోసం విద్యార్థుల నుంచి డబ్బును వసూలు చేస్తున్నాయి. పదో తరగతి పూర్తయిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఈ దోపిడీ సాగుతోంది. కార్పొరేట్ కళాశాలలు తమ కళాశాలలో అడ్మిషన్ చేయించేందుకు ప్రతి ఊరిలోనూ కొంత మందిని నియమించుకుంటారు. వారు విద్యార్థులను చేర్పించిన సంఖ్యను బట్టి కమిషన్ కూడా ఇస్తారు. పదో తరగతి పూర్తయిన కళాశాలలో చేరేందుకు ఎదురుచూస్తున్న విద్యార్థులను ఎరగా చేసుకుని కళాశాలలో సీటు కోసం బేరం కుదుర్చుకుంటారు. అన్నిటికంటే ముందుగా కళాశాలలో సీటు రిజర్వ్ చేయడానికి అడ్వాన్స్ మొత్తాన్ని కట్టాలని చెబుతారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ5,500 అడ్వాన్స్‌గా వసూలు చేస్తారు. కార్పొరేట్ కళాశాలలో చదివించాలనే ఆశతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆ మొత్తాన్ని కట్టి సీటును రిజర్వ్ చేసుకుంటారు. అంతలో మంచి ప్రభుత్వ కళాశాలలోనో, రెసిడెన్షియల్ కళాశాలలోనో, తక్కువ బడ్జెట్‌లోనో ఉన్న కళాశాలలో సీటు దొరికితే విద్యార్థులు వాటిలో చేరిపోతారు. తాము కట్టిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని సదరు కళాశాలను గానీ, డబ్బు కట్టించిన వారిని గానీ అడిగితే అది నాన్ రీఫండబుల్ మొత్తం అంటూ స్పష్టం చేస్తున్నారు. దాంతో వారు కార్పొరేట్ కళాశాలలో సీటు కోసం కట్టిన అడ్వాన్స్ మొత్తాన్ని నష్టపోతున్నారు.

మెటీరియల్ పేరుతోనూ దోపిడీ..

కార్పొరేట్ కళాశాలలు మెటీరియల్ పేరుతోనూ విద్యార్థులను నిట్టనిలువునా దోచేస్తున్నాయి. మెటీరియల్ రూ.12వేల నుంచి రూ.14వేల వరకూ కార్పొరేట్ కాలేజీలు వసూలు చేస్తున్నాయి. నీట్, ఐఐటిల పేరుతో ఈ మెటీరియల్‌ను అంటగడుతున్నారు. ప్రతి విద్యార్థి మెటీరియల్ తీసుకోవాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలు వివిధ పేర్లతో దోపిడీకి పాల్పడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దోపిడీని అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం...

అడ్వాన్స్ పేరుతో, మెటీరియల్ పేరుతో కార్పొరేట్ కళాశాలలు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి ఎటువంటి ఫిర్యాదులూ అందలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఏ కళాశాల అయినా నిబంధనల మేరకే ఫీజులను వసూలు చేయాలి.

- ఆర్.గురవయ్య శెట్టి, ఆర్ఐఓ.

పెంచిన భూముల మార్కెట్ విలువను ఉపసంహరించాలి

- విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి
- సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూముల మార్కెట్ విలువను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాన్ని వేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కర్నూలు జిల్లాలో దాదాపు రూ.50 కోట్ల అదనపు భారం ప్రజలపై పడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన నవరత్నాల అమలు కొరకు నిధులు సమీకరించుకోవడానికి చేతగాక ప్రజలపై భారం వేయడమే పనిగా పెట్టుకున్నదని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్దుబాటు పేరుతో కరెంటు వినియోగదారులపై ఇప్పటికే మూడుసార్లు భారాలు వేసి ప్రజల నడ్డి విరగొట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొంతమందికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలందరిపై భారాలు వేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యుత్తు సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, భూముల మార్కెట్ విలువను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై జిల్లా వ్యాప్తంగా ప్రజలు నిరసన తెలియజేయాలని సిపిఎం అన్ని శాఖలకు ఆయన పిలుపునిచ్చారు.

ఆదోనిలో ఎక్కువగా కేసులు రీఓపెన్

- ఆర్థిక సాయం దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి
- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య
- స్పందనలో బాధితుల నుండి అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆదోని డివిజన్ పరిధిలో ఎక్కువగా కేసులు రీఓపెన్ అవుతున్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య పేర్కొన్నారు. ఆ కేసులన్నిటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థిక సాయం మంజూరుకు వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్పందన ప్రజా వినుతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగన్ననకు చెబుదాంకు సంబంధించి రీఓపెన్ అయిన వాటికి సరైన సమాధానం ఇచ్చి సంబంధిత అర్జీదారునితో మాట్లాడి సమస్య పరిష్కారం పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అని తెలుసుకొని పరిష్కరించాలన్నారు. అసంతృప్తిగా ఉన్న కేసులకు రిమార్క్ సూచించాలని ఇడిఎంకు జెసి సూచించారు. మున్సిపల్ శాఖకు సంబంధించి 30 మంది అర్జీదారులు అసంతృప్తిగా ఉన్నారని వాటిలో 18 ఆడిట్ చేశామని, 11 రీఓపెన్ అయ్యాయని వాటిని క్లోజ్ చేయాలన్నారు. రోడ్లు , భవనాల శాఖకు సంబంధించి 3 పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. భూములకు సంబంధించి 13 నోటిఫికేషన్ పూర్తి అయి నందున డ్రాఫ్ట్ ఆర్ఓఆర్ పబ్లిష్ చేసేలా తహశీల్దార్లు సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూకు సంబంధించి ల్యాండ్ అలియేషన్ ప్రతిపాదనలు పంపని కేతవరం, రాక్ గార్డెన్స్, దిన్నదేవరపాడు, లక్ష్మీపురం గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కర్నూలు ఆర్‌డిఒను జెసి ఆదేశించారు. బిఎస్ఎన్ఎల్ 4జీ టవర్స్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి బిఎస్ఎన్ఎల్ అధికారులకు సంబంధిత స్థలాన్ని అందజేసి అందుకు సంబంధించిన కాపీని కలెక్టర్ కార్యాలయానికి పంపాలని పెద్దకడుబూరు తహశీల్దార్‌ను జెసి ఆదేశించారు. పెద్దకడుబూరు గ్రామంలో పెండింగ్ ఉన్న సరిహద్దు రాళ్లకు సంబంధించి పురోగతి సాధించడంతో వాటి ఏర్పాటుకు సంబంధించి నగదు కోసం లేఖను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగేశ్వరరావు, సిపిఓ అప్పలకొండ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రమ, నాగప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

కొట్టంబడి సమస్యను జెసికి వివరిస్తున్న నాయకులు

సెప్టెంబర్ 1 వరకు ఉద్యమ కార్యాచరణ

- ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ప్రకాశరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి జూన్ 5 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే 8 అంచెల ఉద్యమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కోచైర్మన్ కె.ప్రకాశరావు, ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సభ్యులు ఓంకార్ యాదవ్, జిల్లా ఫ్యాక్టో చైర్మన్ ఎస్. గోకారి, సెక్రటరీ జనరల్ జి. తిమ్మప్ప కోరారు. స్థానిక సలాం ఖాన్ భవనంలోని ఎస్‌టియు కార్యాలయంలో జిల్లా ఫ్యాప్టోకార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జూన్ 5 నుంచి సెప్టెంబరు 1 వరకు 8 అంచెల ఉద్యమం చేపడుతు న్నట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరోధించాలన్నారు. జిఒ నంబరు 117ను రద్దు చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. పదోన్నతుల ను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలన్నారు. పిఆర్‌సి, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. చట్టబద్ధమైన 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్థిక కార్యదర్శి సేవాలాల్ నాయక్, ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి పికె. జనార్దన్ ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు రంగన్న, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు, ఎస్‌టియు నుండి ముదాసిర్ అహమ్మద్, జి.నాగరాజు, గోవిందు, వెంకట రాముడు, డిటిఎఫ్ నుండి గోపాల్ తాజుద్దీన్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు

సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అర్హులకు సంక్షేమ పథకాలు : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 35వ వార్డులోని 91వ సచివాలయం మాధిరాజు నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వార్డ్ కార్పొరేటర్ సాపురు మాధురి, నాయకులు సాపురు వీరయ్య, కార్పొరేటర్ అండ్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు సంగాలసుదర్శన్‌రెడ్డి, దండులక్ష్మీకాంత్ రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొట్టంబడిస్థల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బడి స్థలానికి అక్రమంగా నమోదు చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని, కొట్టంబడి స్థలంలో కమ్యూనిటీ హాలు, లేదా సచివాలయాన్ని నిర్మించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరాగాంధినగర్‌లో ఉన్న పాఠశాల స్థలానికి అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని, ఆ స్థలంలో వార్డు ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పాఠశాల పూర్వపు విద్యార్థులు, అఖిలపక్ష నాయకుల నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి 43 వ వార్డు కార్పొరేటర్ కె.మునెమ్మ, మాజీ కార్పొరేటర్ టి.రాముడు, అఖిలపక్ష పార్టీల నాయకులు యేసు, కరుణాకర్, రోశయ్య, భాస్కర్, రాజశేఖర్ ,నాగేశ్వరరావు, హనుమంతరాయచౌదరి, అరుణ, కుమారి, పూర్వపు విద్యార్థులు అన్నయ్య, డేవిడ్, విక్రమ్ మాట్లాడారు. ఇందిరాగాంధీనగరంలోని కొట్టం బడిని నేను నడుపుతానని టీచర్ డి.రోజ్‌మండ్ బాధ్యత తీసుకొని హరిజన సేవా ఎడ్యుకేషన్ కమిటీ పేరుతో తమ కుటుంబ సభ్యులతోనే సొసైటీని ఏర్పాటు చేసి బడిని ప్రారంభించారన్నారు. సొసైటీ చైర్మన్‌గా ఉన్న టీచర్ రోజ్‌మండ్ పాఠశాల స్థలంలో కాపురం ఉన్నట్టుగా కల్లూరు ఎమ్మార్వోకు లంచం ఇచ్చి ఆమె పేరుతో నాలుగు సెంట్లు స్థలాన్ని పట్టా చేయించుకున్నారన్నారు. ఆమె సొంత ఆస్తిలాగా తమ పిల్లల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఆమె కూతుర్లు వేరే వారికి అమ్మడంతో స్కూల్ స్థలం వేరే వారు కొన్నారని వీధి ప్రజలకు తెలిసిందన్నారు. 2014లో తెలిసినప్పుడు నుండి పాఠశాల పూర్వపు విద్యార్థులు వీధి ప్రజలు గతంలో ఉన్న కలెక్టర్‌కు ఎమ్మార్వోకు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. బడి స్థలానికి అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని, బడి స్థలంలో ప్రజలందరికీ ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, లేదా సచివాలయాలు నిర్మించాలన్నారు. జెసి స్పందిస్తూ పాఠశాల స్థలాన్ని సర్వే చేయించి తప్పకుండా ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్, హుస్సేన్ బాషా, రవి, నాగేశ్వరరావు, లక్ష్మీదేవి, జమున, సావిత్రమ్మ, జీవరత్నం, యేసు, పూర్వపు విద్యార్థులు 43 వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పూర్వవిద్యార్థులు, అఖిలపక్షం ధర్నా

స్పందనలో జెసికి సమస్యను వివరిస్తున్న జి.రామకృష్ణ

నన్నూరు హైవేపై పుట్ వే బ్రిడ్జి పనులు ఆపాలి

-స్పందనలో వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరు హైవేపై పుట్వే బ్రిడ్జ్ పనులను చేపట్టడం సరికాదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పేర్కొన్నారు. వెంటనే అండర్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్యకు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. జి.రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, నన్నూరు గ్రామ పెద్దలు శంషుద్దీన్, గౌండ రాముడు విజయ్, సిఐటియు మండల అధ్యక్షులు శ్రీధర్ రైతు సంఘం నాయకులు మధుసూదన్‌లు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. వారు మాట్లాడుతూ జాతీయ రహదారి పైన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గత అనేక సంవత్సరాలుగా కోరుచున్నామని, అయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కలెక్టర్ స్పందిస్తూ హైవే అథారిటీ వారికి రాస్తానని సమస్యే పరిష్కారం కొరకు ప్రయత్నిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నన్నూరు గ్రామ ప్రజలు మాసుంబాష, బషీర్, సలాం బాష, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఉలిందకొండలో మొక్కలు నాటుతున్న పిడి.అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణలో అందరు భాగస్వామ్యం కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జెఎండి.షఫీ, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, సిబ్బంది, ఎన్ఎస్ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి అన్నారు. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామ పంచాయతీ పరిధిలో రిలయన్స్ స్వచ్ఛంద సంస్థ, అపార్డ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి ఎం.సుంకులమ్మ అధ్యక్షతన పర్యావరణం ప్రతి ఒక్కరి బాధ్యత అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డ్వామా పిడి అమర్నాథ్‌రెడ్డి, అడిషనల్ పిడి సలీంబాష రిలయన్స్ సంస్థ ప్రతినిధులు సురేంద్రనాథ్, స్టేట్ ఆఫీసర్ కుమారస్వామి రెడ్డి డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ రేఖ రెడ్డి, ఆర్గనైజర్ జి.తిరుపతిరెడ్డి, సిఇఒ అపార్ట్ రాఘవ, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చెట్టు కు వందనం - ప్రకతికి ప్రణామం

పత్తికొండ: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సింగంశెట్టి సోమశేఖర్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ మాధురి అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల ఆవరణలోని వేప చెట్టుకు పూలదండను వేసి ప్రిన్సిపల్, ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అధ్యాపకులు, విద్యార్థులు నమస్కరించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.

ప్రిన్సిపల్ మాధురి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవుని చర్యల కారణంగా భూతాపం పెరిగిపోతోందన్నారు. దీనికి విరుగుడు చికిత్స కేవలం మొక్కలు నాటడం, పచ్చదనాన్ని పెంపొందించడం మాత్రమే అని అన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు.

పత్తికొండలో వేపచెట్టుకు దండవేసి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తుగ్గలి ఎంపిడిఒగా సావిత్రి



ప్రజాశక్తి-తుగ్గలి : తుగ్గలి మండల పరిషత్ రెగ్యులర్ ఎంపిడిఒగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత ఏడేళ్ల నుండి తుగ్గలి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి రెగ్యులర్ ఎంపిడిఒ లేక ఇన్‌ఛార్జి పాలనే కొనసాగుతుంది. జిల్లాలో చాలామంది ఎఒలుకు ,ఇఒపిఆర్‌డిలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్ కల్పించడంతో చాలామందికి ఈ అవకాశం కలిగింది. గోస్పాడు మండలంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సావిత్రిని తుగ్గలి రెగ్యులర్ ఎంపిడిఒగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్చార్జి ఎంపిడిఒ వీరరాజును ప్రమోషన్ పై అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

ఎఒగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్

ప్రజాశక్తి- మద్దికేర : మద్దికేర నూతన వ్యవసాయ అధికారిగా రవికుమార్ సోమవారం ఉద్యోగ బాధ్య తలు చేపట్టారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన ఎరువులను, పురుగుమందులను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని, ఆర్‌బికెల ద్వారా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఆర్‌బికెలను సంప్రదించి ఇకెవైసి పూర్తి చేసుకోవాలన్నారు.

నాసిరకం విత్తనాలను అరికట్టాలి : సిపిఎం సిపిఐ ధర్నా

ప్రజాశక్తి- తుగ్గలి

ధర్నాచేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

నాసిరకం విత్తనాలను అరికట్టాలను కోరుతూ తుగ్గలి వ్యవసాయ కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా చేశారు. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలు నాసిరకంగా వస్తున్నాయని, అటువంటి వాటిని వెంటనే అరికట్టాలని వారు మండల వ్యవసాయ అధికారులను కోరారు. వేలకు వేలు డబ్బులు పెట్టి విత్తనాలను కొనుక్కుంటే అందులో నాసిరికం ఉంటే రైతుల పరిస్థితి ఏమని వారు వ్యవసాయ అధికారులపై మండిపడ్డారు. నాసిరకం విత్తనాలను తక్షణమే వెనక్కి పంపాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు గురుదాసు, ఆయా గ్రామాలకు చెందిన సిపిఎం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారికి వినత పత్రం అందజేశారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్

పట్టణంలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచి ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం హౌసింగ్ బోర్డు కాలనీలో చిల్డ్రన్ పార్క్ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీరు నాగభూషణం రెడ్డి, వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి శంకుస్థాపనకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు మ్యాపింగ్ చేయించి రికార్డుల్లో పొందుపరచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. చిల్డ్రన్ పార్కులో పిల్లలకు కావాల్సిన పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టి మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. రాంజల పార్కు, మహావీర్ కాలనీ పార్కు, ఎస్‌కెడి కాలనీ పార్కు, నేషనల్ స్కూల్ దగ్గర ఉన్న పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి వివరించారు. నాయకులు కామాక్షి తిమ్మప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, నాయకులు చంద్రకాంత్ రెడ్డి, అక్షరశ్రీ స్కూల్ రామకృష్ణారెడ్డి, అయ్యాలి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

డయేరియా నివారణపై అవగాహన కల్పించాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్

డయేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సోమవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడిసిఎఫ్) గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అతిసార వల్ల సంభవించే నిర్జలీకరణ మరణాల నివారణ, నియంత్రణ కోసం తీవ్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యకలాపాల సమితిని కలిగి ఉంటుందన్నారు. ఈ కార్యకలాపాల్లో ప్రధానంగా అతిసార నివారణ కోసం అవగాహన కల్పన కార్యకలాపాలను తీవ్రతరం చేయడం, డయేరియా కేసు నివారణ కోసం సేవా సదుపాయాన్ని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

రైతులను నట్టేట ముంచిన వైసిపి ప్రభుత్వం

- తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ రెడ్డి

వైసిపి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 2018 నష్టపరిహారం ఇవ్వకుండా ఇతర పథకాలకు మళ్లించారని తెలిపారు. ఆర్‌బికెల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో రైతులకు భరోసా కల్పిస్తుందని అన్నారు. అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేల సహాయం అందిస్తామని తెలిపారు. 5 కోట్ల మంది ప్రజలకు భవిష్యత్తుపై భరోసా ఇస్తూ ఆరు పథకాలను చంద్రబాబు ప్రకటించడంతో ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ఆలూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోన ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. తాగు, సాగునీరు, రహదారులు అధ్వానంగా ఉన్నా పట్టించుకోరా అని ఆయన ప్రశ్నించారు. టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, కొమ్ము రామాంజి, నాగరాజు, చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు ముద్ద రంగ, గూళ్యం రామాంజినేయులు, ఆంజనేయ్య, జిలన్ బాషా, మాసాల జగన్, హనుమప్ప పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ

ప్రజాశక్తి - ఆస్పరి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన వల్ల ప్రజాధనం వృథా తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆస్పరిలో సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వేదవతి రిజర్వాయర్ పనులు ప్రారంభించి, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. హంద్రీనీవా ద్వారా పిల్ల కాలువలు నిర్మించి సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కరువు ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, వేదవతి ప్రాజక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైతులు జింకల వల్ల తీవ్రంగా నష్టపోతున్నా ముఖ్యమంత్రి జగన్ కనీసం హామీ కూడా ఎవ్వలేదని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, మండల నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, రామాంజినేయులు, మధు రెడ్డి, రామాంజినేయులు పాల్గొన్నారు.

తహశీల్దార్, ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజల ద్వారా దుకాణాలను ప్రారంభిస్తాం

- తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆలూరు

పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన దుకాణాలను ప్రజల ద్వారా తామే ప్రారంభిస్తామని సిపిఎం నాయకులు తెలిపారు. నూతనంగా నిర్మించిన పంచాయతీ షాపులు, ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న షాపులను వెంటనే బహిరంగ వేలం వేసి ప్రారంభించాలని కోరారు. సోమవారం స్పందనలో తహశీల్దార్ విజయ్ కుమార్‌కు, ఎంపిడిఒ అల్లాబకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్ మాట్లాడారు. ఆలూరులో కూరగాయల మార్కెట్ స్థలంలో దాదాపు రూ.1.20 కోట్లతో 27 షాపుల నిర్మాణం పూర్తిచేసి దాదాపు మూడేళ్లయిందని తెలిపారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయం ముందు దాదాపు రూ.80 లక్షలతో 18 షాపులు నిర్మించి దాదాపు రెండేళ్లు పూర్తయిందని చెప్పారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించి అధికార పార్టీ నాయకులు, సర్పంచి మధ్య పంపకాలు కుదరకపోవడం వలన ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. రాష్ట్ర మంత్రి నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో సమస్య ఉండడం దురదృష్టకరమని తెలిపారు. అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌లో ఉన్న షాపులను, ఎంపిడిఒ కార్యాలయం ముందు ఉన్న షాపుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలను సమీకరించి ప్రజల చేత ప్రారంభింపజేయిస్తామని హెచ్చరించారు. నాయకులు కృష్ణ, మైనా, గోవర్ధన్, హుస్సేని పాల్గొన్నారు.

తాగునీటి సంపునకు మరమ్మతులు చేపట్టాలి

- వాటర్ సంపును పరిశీలించిన సిపిఎం నాయకులు

వాటర్ సంపును పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎంఐజి కాలనీలో ఉన్న తాగునీటి సంపునకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం పట్టణ సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, గోపాల్, తిప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎంఐజి కాలనీలో ట్యాంకు దగ్గర ఉన్న సంపును సిపిఎం నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంపు పైభాగం సగం పెచ్చులూడి రంధ్రాలు పడ్డాయని తెలిపారు. చుట్టుపక్కల పిల్లలు ఆడుకుంటూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దుమ్ము, ధూళి, కోతులు, కుక్కలు, పందులు, పక్షులు సంపులో పడి నీరు కలుషితమయ్యే అవకాశముందన్నారు. ఈ నీటినే ట్యాంకుకు చేరుస్తూ వార్డులకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని చెప్పారు. గతంలో నీటి కలుషితం వల్ల కొందరు మృత్యుపడిన ఘటనలు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సంపునకు మరుమ్మతులు చేపట్టి ప్రజల ఆరోగ్యంతోపాటు ప్రాణాలు కాపాడాలని కోరారు. నీటి సంపు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి కంచె ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఒహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించాలి

- ఎంపిడిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అదనంగా రెండు ఒహెచ్‌ఆర్ ట్యాంకులను నిర్మించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఒక ట్యాంకు ద్వారా సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అప్పుడు ఉన్న జనాభా ప్రకారం ఆ ట్యాంకు నిర్మించారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో జనాభా పెరగడంతో సమస్య ఏర్పడిందన్నారు. జనాభాకు అనుగుణంగా అదనంగా రెండు ట్యాంకులు నిర్మిస్తే నీటి సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఒకే మోటార్‌తో వివిధ గ్రామాలకు నీటిని పంపిణీ చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. బాపురం గ్రామానికి అదనంగా మరో మూడు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో నీటి కనెక్షన్లు అధికంగా ఇవ్వడం కూడా సమస్యకు కారణమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆగస్టు వరకు కొత్త నీటి కనెక్షన్లను ఇవ్వరాదని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఉళ్లిగయ్య, సత్యప్ప, వీరేష్, వలీ, రామలింగ, అల్లమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్‌బికెల ద్వారా రైతులకు మెరుగైన సేవలు : ఎడిఎ సునీత

ప్రజాశక్తి-ఆలూరు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆలూరు ఎడిఎ సునీత తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎఒలు, ఎఇఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆలూరు సబ్ డివిజన్‌కు 900 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. వేరుశనగ పూర్తి ధర క్వింటా రూ.9,300 కాగా 40 శాతం సబ్సిడీతో రూ.5,580 ధర రైతుకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎఒలు వెంకటేశ్వర గౌడ్, శివశంకర్, ఆనంద్, టెక్నికల్ ఎఒ దేవభూషణ కుమార్, ఎఇఒలు విరుపాక్షి, రమాదేవి, మంజనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

నూతన ఎఒగా హేమలత

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల ఎఒగా సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎఒగా పని చేస్తున్న ఐ.రాజా కిషోర్ సాధారణ బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరు సమీపం లోని ముగతి ఫారంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మద్దికెర ఎఒగా విధులు నిర్వహిస్తున్న జి.హేమలత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ... ఆర్‌బికెల సిబ్బంది రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఆర్‌బికె కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అలాగే ఈకేవైసీ చేయించుకోని రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఖాద్రీ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై మురుగునీరు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు స్టేషన్ సమీపంలోని మసీదు దగ్గర డ్రెయినేజీ కాలువ నిండిపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆ రోడ్డుపై వెళ్లే వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీటి దుర్వాసనతో ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి నిండిన మురుగు కాలువను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రేషన్ కార్డుదారులకు ప్రతినెలా కందిపప్పును పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు రాముడు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ జయన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆహార భద్రత చట్టాన్ని తుంగలోకి తొక్కుతున్నారని, పేదలకు నిత్యావసరమైన కందిపప్పును కచ్చితంగా అందజేయాలని కోరారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు యుఎల్.లక్ష్మి నరసయ్య, ఎం.అబ్దుల్లా, బి.రాజు, యు.రమేష్, పి.కనకవీడు రాజు, గుంటప్ప, రవికుమార్, రాజు, ఆంథోని పాల్గొన్నారు.

పరిసరాల రక్షణ, భవిష్యత్తు తరాలకు పరిరక్షణ

- ప్రిన్సిపల్ మహబూబ్ బాష

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిసరాల రక్షణ, భవిష్యత్తు తరాలకు పరిరక్షణ అని శ్రీమహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్ బాషా, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య తెలిపారు. సోమవారం శ్రీమహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్లాస్టిక్ వాడకం నిర్మూలన' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో కాలుష్యాన్ని తగ్గించాలంటే పరిసరాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా భావించి ప్రజలను చైతన్యపరచాలని చెప్పారు. తమ చిన్నతనంలో గ్రామగ్రామాన చెట్లు, చామలతో ప్రకృతి సస్యశ్యామలంగా ఉండేదని తెలిపారు. తద్వారా జంతు జాతి నివసించేదన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రజలను చైతన్యపరిచి, సమీకరించి మొక్కలు నాటాలని కోరారు. దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పుడమిని కాలుష్య కోరల్లో నుంచి కాపాడాలని తెలిపారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు కచ్చితంగా కాటన్ సంచులను తీసుకెళ్లేలా అలవాటు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఇప్పటికే మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించిన కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులను జెవివి నాయకులు అభినందించారు. అనంతరం కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్ కుమార్, జెవివి సీనియర్ నాయకులు మాదన్న, కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు, ఐక్యూఎసి సమన్వయకర్త డాక్టర్ ఎం.సుశీలమ్మ, జెవివి సీనియర్ నాయకులు నారాయణ, కళాశాల ఉపన్యాసకులు న్యూటన్ రాజు, ఖాదర్ బాషా, రామాంజనేయులు, క్రమర్, వెంకట నాయుడు, ఈరన్న, మనోరంజన్, జెవివి నాయకులు తాయప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా

చిప్పగిరి ఎంపిడిఒగా కొండయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

సాధారణ బదిలీల్లో భాగంగా చిప్పగిరి ఎంపిడిఒగా సివి.కొండయ్యను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఎఒగా పని చేస్తున్న సుధాకర్ రాజు పదోన్నతిపై అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్యాపిలి మండల కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న సివి.కొండయ్య పదోన్నతిపై ఎంపిడిఒగా చిప్పగిరికి బదిలీపై వచ్చారు. సోమవారం చిప్పగిరిలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణను, తర్వాత ఆలూరుకు వెళ్లి మంత్రి జయరామ్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. విధుల్లో పారదర్శకంగా పని చేయాలని, కింద స్థాయి సిబ్బందితో సఖ్యతగా ఉండి విధులు చేయించుకునేలా ఉండాలని తెలిపారు. వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ నారాయణ స్వామి, ఎపిఒ మాధవ శంకర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం : ఎస్ఎఫ్ఐ

ఆదోని : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం ఎస్ఎఫ్ఐ పాటుపడుతోందని తెలిపారు. పిల్లలకు ఆస్తులు, అంతస్తులు ఇవ్వకున్నా బతుకుతారు కానీ, ఆక్సిజన్ లేకుండా బతకలేరని చెప్పారు. మొక్కలు నాటి రాబోయే తరాలకు ఆరోగ్యాన్ని పంచుదామని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, నాగరాజు, వీరేష్, గౌస్, శశి, విష్ణు పాల్గొన్నారు.

ఎద్దుల పారువేట

ఆదోని : ఏరువాక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పర్వతాపురం కాలనీలో సోమవారం ఎద్దుల పారువేట నిర్వహించారు. పారువేటలో ముందు వచ్చిన వృషభాలకు కాలనీలోని బొడ్రాయి వరకు ఊరేగింపు నిర్వహించామని కాలనీవాసి వెంకటేష్ తెలిపారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రతేడాది వృషభాలను రంగుల పూలతో అలంకరించి పారువేట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే ఆదోని మండలం పెసల బండ గ్రామంలో బసవేశ్వర ఆలయం నుంచి బొడ్రాయి వరకు పారువేట నిర్వహించారు.

శ్యాంపిల్ మేనిఫెస్టోకే వణికిపోతే ఎలా

- ముందుంది అసలైన మేనిఫెస్టో

- సిఎం జగన్ చెప్పేవన్నీ అపద్ధాలే - మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి విడుదల చేసిన శ్యాంపిల్ మేనిఫెస్టోకే వణికి పోతే ఎలా అని, పూర్తి మేనిఫెస్టో ముందుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక బీవీ నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మహానాడు వేదికగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైసిపి శ్రేణుల్లో వణుకు మొదలైందన్నారు. ఇటీవల పత్తికొండలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులపై కపట ప్రేమ చూపించారని ఎద్దేవా చేశారు. 'నేను వచ్చి కాలు మోపిన తర్వాత మన ప్రాంతం కర్నూలులో కరువు మండలాలు లేవని, అద్భుతం జరిగింద'ని జగన్మోహన్ రెడ్డి సంకలు గుద్దుకుంటున్నారని తెలిపారు. ప్రజలు దాహంతో అలమటిస్తున్నారని, లోకేష్ పాదయాత్రలో మహిళలు బిందెలతో ఎదురొచ్చి ఆవేదనను వ్యక్తం చేసినందుకు ఇంటింటికి కుళాయి పథకాన్ని రాష్ట్రమంతా అమలు చేస్తామని హామీ ఇస్తూ టిడిపి మేనిఫెస్టోలో పెట్టారని చెప్పారు. ఈ ఏరువాక పండగ రోజు నుంచి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఏరువాక దుక్కి దున్నిన మాజీ ఎమ్మెల్యే బీవీ

- టిడిపి అధికారంలోకి వస్తే రైతులకు పూర్తి సహకారం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ.జయనాగేశ్వర రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏరువాక సందర్భంగా సోమవారం నాగలి దుక్కి దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలో వస్తే వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తామని తెలిపారు. రైతులకు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రోత్సాహకంగా ప్రతేడాది రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. ఏరువాక పౌర్ణమి రైతులకు అతి పెద్ద పండగని, భూమిని, పశువులను, వ్యవసాయ పనిముట్లను పూజించే పండగని చెప్పారు. చంద్రబాబు నాయుడు పాలనలో వ్యవసాయాన్ని పండగ చేసి లాభసాటి చేయగా, ఈ నాలుగేళ్లలో జగన్ రెడ్డి పాలనలో అన్నదాతలు అప్పుల పాలయ్యారని తెలిపారు. ధరల స్థిరీకరణ ఊసే లేకుండా రైతు భరోసాను రైతు దగా చేసి, మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరి తాళ్లు బిగిస్తున్నారని విమర్శించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతుల అవసరాలను గుర్తించి రైతుల సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచి హైమావతి, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, బేతాళ బడేసా ఎన్‌వి.రామాంజనేయులు, గాజులదిన్నె హనుమంతు, తిరుపతయ్య నాయుడు, శ్రీధర్ నాయుడు, రమేష్ నాయుడు, పూజారి చంద్ర, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, అచ్చుగట్ల ఫక్రుద్దీన్, నూర్ అహ్మద్, కులుమాల రాముడు, ఎర్రబాడు శ్రీను, లింగందిన్నె అయ్యన్న, కైరవాడి తిమ్మారెడ్డి, గంజిహళ్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

దుక్కి దున్నుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

నిబంధనలకు లోబడే నిర్మాణాలు చేపట్టాలి

- సర్పంచి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో గృహ నిర్మాణాలు చేపట్టే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు లోబడే నిర్మించుకోవాలని సర్పంచి దాసరి గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి బాలన్న ప్రజలకు సూచించారు. సోమవారం వారు పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గృహ నిర్మాణాలు చేపడుతున్న వారు పంచాయతీ ఆదేశాలను పక్కన పెట్టి చాలా వీధుల్లో గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. బాత్‌రూములు, కూర్చోవడానికి కట్టలు నిర్మించి వాహనాలు పోవడానికి కూడా ఇబ్బంది పడేలా చేస్తున్నారని చెప్పారు. కొంతమంది కాలువలు దాటి కట్టిస్తున్నారని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పంచాయతీల ద్వారా నోటీసులు అందజేస్తామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టేవారు పంచాయతీల్లో ఏ వీధి, ఏ కొలతలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. అక్రమ కట్టడాల వల్ల ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు.

హరిచంద్రప్ప కాలనీవాసులు ఆందోళన

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలోని హరిచంద్రప్ప కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకు భూమి లోపల ఉన్న పైపులను సోమవారం కొందరు తొలగించారు. ట్యాంకు దగ్గర ఉన్న ప్రజలు ఇష్టారాజ్యాంగ కుళాయి పైపులను సొంతంగా తొలగించడం ఏమిటని కాలనీ వాసులు ప్రశ్నించారు. ఈ నీరు కేవలం వాడుకోవడానికి తప్ప తాగడానికి పనికి రావు. కొందరు ఓర్వలేక పైపులను తీసేశారని పేర్కొన్నారు. సర్పంచి వెంటనే స్పందించి పైపును యథావిధిగా చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచికి తెలియకుండా సొంతంగా పైపులను తొలగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.

వృషభాలపై ఎమ్మెల్యే పేరుతో చిత్రం

- వైసిపిపై అభిమానం చూపిన ప్రజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

వృషభాలపై వైసిపి రంగులతో పాటు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చిత్రం వేసి వైసిపిపై గల అభిమానాన్ని అభిమానులు చాటుకున్నారు. సోమవారం మండలంలోని వగరూరు గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా మొత్తం ఐదుగురు రైతులు వైసిపిపై గల అభిమానాన్ని చాటుకున్నారు. బోయ రాముడు, బోయ ఉరుకుంద, కురువ గజ్జల గుర్రం కుటుంబ వారు ఐదు జతల ఎద్దులపై వైసిపి రంగులతో పాటు ఆ పార్టీ ఫ్యాన్ గుర్తును, తమ అభిమాన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చిత్రాన్ని, మండల నాయకులు సి. విశ్వనాథ్ రెడ్డి పేరును రంగులతో వేశారు. ఏరువాక పౌర్ణమి పండగ వివిధ గ్రామాల్లో జరిగినప్పటికీ ఈ వృషభాలపై వైసిపి రంగులతో పాటు 'జై జగన్' అంటూ పార్టీ గుర్తును, ఎమ్మెల్యే పేరు, విశ్వనాథ్ రెడ్డి పేరు ఉండడం వల్ల ప్రత్యేకత సంతరించుకుని సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించింది.

వృషభాలపై రంగురంగులతో వేసిన ఎమ్మెల్యే చిత్రం

మహిళలపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

- సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

హాలహర్వి మండలం కామినహాల్ గ్రామంలో తల్లి, కూతుళ్లపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఆలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను నాయకులు పరామర్శించారు. గాయాలపాలైన బాధితులను సిపిఎం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పరామర్శించి సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి మాట్లాడారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో కామినహాల్ గ్రామంలో తల్లి, కూతుళ్లపై అదే గ్రామానికి చెందిన కొందరు అఘాయిత్యానికి ప్రయత్నించి కొడవళ్లతో దాడి చేశారని తెలిపారు. తల్లి, కూతుళ్లపై అఘాయిత్యానికి ప్రయత్నించి దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, ఎస్ఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.

'అంబేద్కర్ భవన్ స్థలాన్ని సర్వే చేసి హద్దులు చూపండి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన నిర్మాణం కోసం కేటాయించిన ఎమ్మిగనూరు గ్రామ సర్వే నెంబర్లు 251/1,251/3 పైకిలో గల 1.60 ఎకరాల భూమిని సర్వేయర్‌తో సర్వే చేయించి భూమి సరిహద్దులు చూపించి, చుట్టూ కంచె వేయించి భవిష్యత్తులో అన్యాక్రాంతం కాకుండా స్థలాన్ని పరిరక్షించాలని దళిత సంఘం నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ స్పందిస్తూ... సర్వేయర్‌ను పంపి సర్వే చేసి సరిహద్దులు చూపుతామని హామీ ఇచ్చారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటీ ఛైర్మన్ కదిరికోట ఆదెన్న, పూలే, అంబేద్కర్ ఐడియాలజీ కన్వీనర్ ఎసి.దేవదానం, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కనకవీడు రాజు, మాల మహానాడు (జూపూడి వర్గం) తాలూకా ప్రధాన కార్యదర్శి కెఎం.హుస్సేనప్ప, దళిత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు రోజా ఆర్ట్స్ హుస్సేని, ఎఐఎఫ్‌టియు నాయకులు డి.సంజీవ్, కెవిపిఎస్ నాయకులు సుమాల ఆంథోని, గుంటెప్ప పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

ఆస్పరి : మండల సర్వసభ సమావేశంలో కోరం లేక వాయిదా పడింది. ఎంపిపి సుకర ఉమాదేవి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఉదయం 12 గంటల వరకు వేచి చూసినప్పటికీ సమావేశ నిర్వహణకు అవసరమైన సభ్యులు రానందున సమావేశాన్ని ఎంపిపి వాయిదా వేశారు. మండలంలో 19 మంది ఎంపిటిసిలు ఉండగా ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. కోరంకు 11 మంది సభ్యులు కావాల్సి ఉంది. ఏడుగురు మాత్రమే హాజరు కావడం వల్ల సమావేశ నిర్వహణ సాధ్యం కాలేదు. మరో రోజు సమావేశం నిర్వహిస్తామని ఎంపిడిఒ రాధ తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

కౌతాళం : శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.1,00,114 విరాళంగా ఇచ్చినట్లు దేవాలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, సిబ్బంది మల్లి తెలిపారు. సోమవారం కర్నూలు నగరానికి చెందిన నరహరి కుమారుడు విశ్వక్ కార్తికేయన్ అనే భక్తుడు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాతల పేరున దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలు అందజేసినట్లు చెప్పారు. నిత్యాన్నదానం కార్యక్రమంతో పాటు పుణ్యక్షేత్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భక్తులు విరాళాలు అందించి అభివృద్ధి పనుల్లో పాలుపంచుకోవాలని కోరారు.

పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

'మధ్యాహ్న భోజన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం
- కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మధ్యాహ్న భోజన పథకంలో గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసు రత్నం, జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్రేసమ్మ, శకుంతల మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ. 20 పెంచాలన్నారు. పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని కోరారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని చెప్పారు. వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదాలకు గురయితే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మంచి నీరు, వంట షెడ్లు, వంట పాత్రలు, గ్యాస్ ప్రభుత్వమే కల్పించాలన్నారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెంచడానికి పిల్లలకు రుచికరమైన పౌష్టిక ఆహారం అందించి రక్తహీనత సమస్యను అధిగమించాలని కోరారు. మంచి లక్ష్యాలతో ప్రారంభించిన ఈ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 45,054 పాఠశాలల్లో దాదాపు 89 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరికి పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మికులపై నేటికీ రాజకీయ వేధింపులు ఉన్నాయని అన్నారు. వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. ఈ పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం ఉందని, ఇది అన్యాయమన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిఇఒ అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పాణ్యం మండల కార్యదర్శి భాస్కర్, నందికొట్కూరు పట్టణ కార్యదర్శి జయ రాణి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు మేరీ, ప్రీతి, సంతోషి, సుమలత, చిన్నమ్మ, శకుంతల, లక్ష్మీదేవి, విమలమ్మ, సుందరమ్మ, మద్దమ్మ, రవణమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కూతూరు మృతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సోమవారం బైక్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రీ కుమార్తె మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు.. దొర్నిపాడు గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్ వలి తన భార్య కాశింబి, ముగ్గురు పిల్లలతో కలిసి సోమవారం బనగానపల్లెకు బైకుపై బయల్దేరాడు. కోవెలకుంట్ల వైపు నుండి ఆళ్లగడ్డ వైపు వస్తున్న కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న హుస్సేన్ వలి (38), పెద్ద కూతురు అమీనా(10) ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య కాశింబికి వెన్నెముఖ, కాళ్లకు గాయాలయ్యాయి. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై తిరుపాలు, సిబ్బంది చేరుకొని గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రీ కుమార్తె మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సిఐ తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమని

మృతి చెందిన హుస్సేన్ వలి

తెలుస్తుంది. మృతి చెందిన హుస్సేన్ వలి వ్యవసాయ కూలిగా పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ నరేంద్ర పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

ఫిర్యాదులను పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకొని ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లాధికారులు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కంటే మెరుగ్గా ఉండేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారని, నమోదైన దరఖాస్తులను 24 గంటల్లో ఓపెన్ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులన్నింటినీ అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లాస్థాయి ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్
- జిల్లా వ్యాప్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటే బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ కోరారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీ, చిన్న చెరువు కట్ట గట్టుపై అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి మానవ జీవనశైలిని ప్రోత్సహించడానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. జిల్లా

మొక్కను నాటుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

అటవీశాఖ ఆధ్వర్యంలో నంద్యాల చెరువుకట్ట, ఎస్‌బిఐ కాలనీల్లో జామున్, ఫికస్, మద్ది, మేడి తదితర విభిన్న రకాల అటవీ జాతుల మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం రోజూ వచ్చే వాకర్‌తో జిల్లా కలెక్టర్ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ మాట్లాడుతూ గత నెల రోజుల నుండి అటవీ విశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 900 కార్యక్రమాలు నిర్వహించామన్నారు. చెరువు కట్ట వెంట ఉన్న కాలిబాటకు నంద్యాల ట్యాంక్ బండ్ అని పేరు పెట్టేందుకు బోర్డుతో పాటు దాదాపు 100 చెట్లను నాటామని తెలిపారు. రోజూ వచ్చే వాకర్స్ ఒక అసోసియేషన్‌గా ఏర్పడి ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్, స్థానిక (మిగతా 6వ పేజీలో..)

ఖరీఫ్‌కు సిద్ధం

- నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండల పరిధిలో రైతాంగం ఖరీఫ్ పంటలు వేసేందుకు పొలాలను సిద్ధంగా చేశారు. రుతు పవనాలు ఒక వారం లేటు కావడంతో రైతులు విత్తనాలు, ఎరువులు అన్ని సమకూర్చుకునే పనిలో పడ్డారు. వర్షాలు వచ్చిన వెంటనే విత్తనాలు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఖరీఫ్ సీజన్లో పాములపాడు మండలంలో దాదాపుగా 18,750 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారు. అందులో ప్రధాన పంటలుగా మొక్కజొన్న 10 వేల ఎకరాలు, సోయాబీన్ 4,750 ఎకరాలు, పత్తి 1000 ఎకరాలు, కంది 1500 ఎకరాలు, వరి పంట 2500 ఎకరాల్లో సాగు చేస్తారు. మండల పరిధిలోని 13 ఆర్‌బికె కేంద్రాల ద్వారా రైతులకు జీలుగ, సోయాబీన్ విత్తనాలను అందు బాటులో ఉంచారు అధికారులు. అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచారు. రైతన్నలు ఈ సంవత్సరం మే నెలలో వర్షాలు పడడంతో కొంతమంది ముందస్తుగానే బోరు బావుల కింద మొక్కజొన్న, పత్తి పంటలు ఇప్పటికే వేశారు.

నకిలీ విత్తనాలపై రైతులు జాగ్రత్తలు వహించాలి

రైతులు నకిలీ విత్తనాలు కొనకుండా జాగ్రత్తలు పాటించాలి. లైసెన్స్ వున్న షాపుల నుండి మాత్రమే విత్తనాలు కొనాలి. కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదులు పొందాలి. గ్రామాలలో మధ్య మనుషుల ద్వారా అమ్మే విత్తనాలను కొనకూడదు. ఎలాంటి పర్మిషన్ లేకుండా గ్రామాలలో విత్తనాలు అమ్మినట్లయితే ఎవరైనా ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలి. రైతులు చిరుధాన్య పంటలు పండించినట్లయితే ఎన్ఎఫ్ఎస్ఎం స్కీం కింద ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేస్తుంది.

- మండల వ్యవసాయ అధికారి ఎంపి ఫణీశ్వర్ రెడ్డి.

రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

రైతులకు ప్రభుత్వం అన్ని రకాలవిత్తనాలను ,ఎరువులను రాయితీతో రైతుల ఇవ్వాలి. విత్తనాలను అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలి. అధికారులు నకిలీ విత్తనాలను మార్కెట్లో అమ్మకుండా అరికట్టి, అమ్మే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

- రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు .

కుంగిపోతున్న గోరుకల్లు ఆనకట్ట

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి : ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్

కుంగిపోతున్న గోరుకల్లు రిజర్వాయర్ ఆనకట్టకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోరుకల్ రిజర్వాయర్ ఆనకట్ట గత నెల రోజుల క్రితం నుండి రెండు చోట్ల సుమారు 120 మీటర్లు పొడవునా భూమి అడుగు భాగానికి కుంగిపోతుందని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్లో కేవలం మూడు టిఎంసిల నీళ్లు ఉండడం వల్ల కట్ట కుంగిన కూడా ఎక్కువ ప్రమాదం కనబడడం లేదని, కానీ వ్యవసాయ సీజన్ ప్రారంభమై వర్షాలు తీవ్రంగా పడి ప్రాజెక్టులకు నీళ్లు రావడం ప్రారంభమైతే కుంగిన కట్ట వల్ల నీరు స్టాక్ పెట్టుకునే దానికి అవకాశం ఉండదని అన్నారు. ఫలితంగా నంద్యాల జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలోని రైతాంగానికి సాగు, తాగునీరు కొరత ఏర్పడు తుందని తెలిపారు. కట్ట కుంగడం వల్ల గోరుకలు ప్రజలు తీవ్ర భయాందోళనలతో నివసిస్తున్నారని చెప్పారు. ఇరిగేషన్ అధికారులకు స్థానిక ప్రజలు తెలియజేసినా ఎలాంటి చర్య తీసుకోలేదని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మరమ్మతు చర్యలు పూర్తి చేస్తామని ఇరిగేషన్ ఎస్ఇ ప్రకటించి చాలా రోజులు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, నిధుల కేటాయింపు జరగనందువల్లనే మరమ్మతు పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన కట్ట మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామ చంద్రుడు, పాణ్యం మండల నాయకులు కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని జోలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మారెమ్మ, కుంటెమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల డివిజన్ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక నిర్వహించారు. అంతకుముందు పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డికి టిడిపి గ్రామ నాయకులు తలారి తిరుమలయ్య, నాగరాజు యాదవ్, కతాల మధు, తలారి హరికృష్ణల ఆధ్వర్యంలోకార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు కతాల తిరుపాల్, విఆర్వో నారాయణరెడ్డి, గంధం హుసేని, ఉప్పు ప్రతాపరెడ్డి, పల్లె తిరుపతయ్య, శ్రీపతి నారాయణ, తలారి తిరుమలయ్య, గుడిపాటి తిమ్మారెడ్డి, గుడిపాటి రమణ, గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో విగ్ర ప్రతిష్ఠ మహొత్సవాలు వైభవంగా జరిగాయి.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

భూమా ప్రీమియర్ లీగ్ రాయలసీమ స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు బిజెపి ఆళ్లగడ్డ తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి బహుమతులను సోమవారం ప్రదానం చేశారు. రాయలసీమ జిల్లాల నుండి 50 జట్లు పోటీలలో పాల్గొనగా 16 రోజులపాటు ఈ పోటీలు జరిగాయి. సోమవారం సాయంత్రం ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదటి బహుమతి కడప సన్నీ రూ.లక్ష, రెండవ బహుమతి నంద్యాల రామ్స్ రూ.50 వేలు, మూడో బహుమతి కర్నూలు రాయల్ బుల్లెట్ రూ.25 వేలు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో అంబటి మహేశ్వర్ రెడ్డి, నాగిరెడ్డి పల్లె శంకర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

విజేతకు చెక్కును అందజేస్తున్న భూమా కిషోర్ రెడ్డి

మహాధర్నాను జయప్రదం చేయండి

- కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న మంగళగిరి సిసిఎల్ ఆఫీస్ వద్ద జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మార్క్ కోరారు. సోమవారం నంద్యాలలోని టి.నరసింహయ్య భవనంలో ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఒసి కులాలకు సంబంధించి కూడా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని, సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించి నిజంగా సాగులో ఉన్న ప్రతి కౌలు రైతుకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. దేవుని మాన్యం భూములను కూడా కౌలు రైతులకు ఇచ్చి విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. ఏ నిబంధన లేకుండా నేరుగా కౌలు రైతులకు సబ్సిడీ అందించాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు ఎక్స్‌గ్రేసియా రూ. 7 లక్షల వరకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు రామచంద్రుడు, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఏలియా, జిల్లా నాయకులు భాస్కర్, రాజు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

రోగి సహాయకులే వార్డ్ బాయ్‌లుగా..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వార్డు బాయ్‌లు లేకపోవడంతో రోగులను వారి సహాయకులే స్ట్రక్చర్లలో తీసుకెళ్తున్న పరిస్థితి సోమవారం కనిపించింది. ప్రభుత్వాసుపత్రిలో వార్డుబాయ్‌ల జాడే కనపడటం లేదు. రోగులను స్ట్రక్చర్‌పై, వీల్ చైర్‌పై వార్డు బాయ్‌లు తీసుకెళ్లాలి. కానీ వార్డు బాయ్‌లు కనిపించకపోవడంతో రోగి సహాయకులే తీసుకెళ్తున్న పరిస్థితి నెలకొంది. వార్డు బాయ్‌లు ఉన్నారా లేరా..? ఉంటే అటెండెన్స్ మాత్రం వేసుకొని బయట తిరుగుతున్నారా అంటూ రోగులు, బంధువులు ఆగ్రహం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న జిల్లా ఆసుపత్రిలో రోగులను తీసుకెళ్లేందుకు వార్డు బాయ్‌లు కనిపించకపోవడం అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

అమ్మమ్మను స్ట్రక్చర్ పై తీసుకెళ్తున్న చిన్న పిల్లలు

వృద్ధురాలిని వీల్ చైర్‌పై తీసుకెళ్తున్న వృద్ధుడు

పట్టుకున్న లారీతో అధికారులు

600 ప్యాకెట్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - అవుకు : పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం 600 ప్యాకెట్లు తమిళ నాడుకు అక్రమంగా తరలి స్తుండగా విజిలెన్స్ అధికారులు సోమవారం అవుకు పట్టణంలో పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సిఐ ఎ.నాగరాజు యాదవ్ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణం నుండి లారీలో 600 ప్యాకెట్ల రేషన్ బియ్యంతో తమిళనాడు రాష్ట్రానికి బయలుదేరిన లారీ అవుకు మీదుగా వెళుతుందన్న సమాచారం మేరకు అవుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద లారీని క్రాస్ చేసి పట్టుకున్నామన్నారు. లారీ డ్రైవర్లు నారాయణరెడ్డి, రాముడులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అవుకు తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం ఇవ్వగా ఆర్ఐ వెంగళరెడ్డి, వీఆర్వో చంద్రహాస రెడ్డిలు పంచనామా నిర్వహించి కోయిలకుంట్ల ఎంఎల్ఎస్ పాయింట్‌కు రేషన్ బియ్యాన్ని తరలించి లారీని అవుకు పోలీస్టేషన్లో అప్పగించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల లో భాగంగా సోమవారం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.అనురాధ తెలిపారు. జిల్లాలోని 47 పరీక్షా కేంద్రాలలో 1035 విద్యార్థులకు గాను 582 మంది హాజరయ్యారని, 453 మంది గైర్హాజరయ్యారన్నారు.

అవుకు ఎంపిడిఓగా వెంకటేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - అవుకు : అవుకు ఎంపిడిఒగా జి.వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న అజాంఖాన్ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లా గూడూరులో పని చేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డిని జిల్లా అధికారులు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006 నుండి 2013 వరకు గతంలో ఇక్కడ సూపరింటెంట్‌గా పని చేశానని, ఇక్కడి మండల పరిస్థితిపై అవగాహన ఉందని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆళ్లగడ్డ ఎంపిడిఓగా మహబూబ్ ఖాన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మహబూబ్ ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా అధికారులు మహబూబ్ ఖాన్‌ను ఆళ్లగడ్డకు నియమించారు. ఇక్కడ పని చేస్తున్న సుబ్బారెడ్డిని దొర్నిపాడుకు బదిలీ చేశారు.

రుద్రవరం మండల వ్యవసాయ అధికారిగా శ్రీకృష్ణ

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం మండల వ్యవసాయ అధికారిగా శ్రీ కృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి కోయిలకుంట్ల మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో దొర్నిపాడు మండలం వ్యవసాయ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వెదురు వేలంలో రూ.6.49 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరంలోని ఫారెస్ట్ కార్యాలయం ఆవరణంలో సోమవారం నిర్వహించిన వెదురు వేలం పాటల్లో రూ.6 లక్షల 49 వేలు ఆదాయం వచ్చినట్లు డీఎఫ్ఓ వినీత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి తరగతి వెదుర్లు 3 వేలు, మూడవ తరగతి వెదుర్లు 27 వేలు సేకరించి వేలం నిర్వహించినట్లుచ ఎప్పారు. ఈ వేలం పాటల్లో రేంజి అధికారి శ్రీపతి నాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, డిపో ఫారెస్టర్ నాగరాజు, ఏరియా ఫారెస్టర్లు రాణమ్మ, మేస్త్రీలు కిట్టు, నరసింహ, సాయి, కాంట్రాక్టర్,కొల్లంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గురురాజా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గురురాజా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ చర్యలు' అంశంపై, డ్రాయింగ్ కాంపిటీషన్‌లో వి.శ్రావణి ప్రథమ స్థానం, వ్యాసరచన పోటీలో కె.నాగకుమారి ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. జిల్లాలో అత్యధిక బహుమతులు సాధించిన పాఠశాల తమనదేనని తెలియజేయుటకు సంతోషిస్తున్నామని అన్నారు. ఈ విజయాలే తమ విద్యావిధానాలకు నిదర్శనమన్నారు. ప్రతి రంగంలో విద్యార్థులకు చక్కని శిక్షణ అందిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలు వెలికితీస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి ఇదే మా మొదటి విజయమని, విద్యార్థుల విజయాలను ప్రశంసించారు.

బహుమతులు అందుకుంటున్న దృశ్యం

11న ఆదర్శలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : ఎపి మోడల్ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పాణ్యం చంద్రసేన రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ హాల్ టికెట్లను apms.apcfss.in వెబ్ సైట్లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో మోడల్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - బనగానపల్లె : జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ (ఉపన్యాస) పోటీలలో పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని కె.హరిణి మొదటి బహుమతిని సాధించినట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి సోమవారం తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి అవార్డును అందుకుంటున్న మోడల్ విద్యార్థిని

ప్రజాశక్తి
www.prajasakti.com

భూ యజమాని సంతకం లేకుండ కౌలు కార్డు ఇవ్వాలి

- ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కౌలు చట్టాన్ని సవరించాలని భూయజమాని సంతకం తొలగించాలని కోరుతూ ముష్టపల్లె గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, కౌలు రైతులు, తదితరులు సోమవారం నాడు సచివాలయ అధికారికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పి సుధాకర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కౌలుదారులకు కౌలు కార్డులు రాకుండా భూ యజమాని సంతకం ఉంటేనే కార్డులు అందే విధంగా చట్టాన్ని చేయడం దారుణం అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఈనెల 12వ తేదీ వరకు మంగళగిరి దగ్గర సీసీఎల్ఏ ఆఫీసు ముందు అధికారులతో రాయబారం కార్యక్రమం చేపడు తున్నాం అన్నారు. ఈ కౌలు రైతుల రాయబారం పాదయాత్రలు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

రైతు సుభిక్షమే ప్రభుత్వ ధ్యేయం : వైసిపి

ప్రజాశక్తి -ప్యాపిలి

రైతుల సుభిక్షమే ప్రభుత్వ ధ్యేయం అని జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణ మూర్తి, సచివాలయ కన్వీనర్ బోర మల్లికార్జున రెడ్డి అన్నారు. ప్యాపిలి పట్టణంలోని క్రింది గేరి రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరు శనగ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం సర్పంచి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరు శనగ పూర్తి ధర రూ.9300 కాగా సబ్సిడీ పోగా రైతు వాటా ఒక బస్తా ధర రూ.1674 ఉందని, ఒక పాస్ పుస్తకానికి 3 పాకెట్స్ ఇవ్వబడునని తెలిపారు. మండలానికి 1500 క్వింటాలు వచ్చాయని, కావున రైతులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో చంద్ర శేఖర్ రెడ్డి, ఏడిఏ అశోక్ వర్ధన్ రెడ్డి, ఇంచార్జి ఏఓ నవీన,ప్రభాకర్ రెడ్డి, మైనారిటీ నాయకుడు మస్తాన్ ఖాన్, రవి, శీను, తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఓరకల్లు మండలం సోమయాజుల పల్లె నుండి బేతంచెర్ల మీదుగా డోన్ హైవే వరకు జరుగుతున్న నేషనల్ హైవే 340 బి రహదారి పనులను మున్సిపల్ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి సోమవారం పరిశీలించారు. బేతంచెర్ల పట్టణంలోని ఐల చెరువు ఎస్విజి రాఘవేంద్ర ఫ్యాక్టరీ దగ్గర నిర్మిస్తున్న ఫస్ట్ బ్రిడ్జి పనులను, వాటి నాణ్యతను చైర్మన్ పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులపై కాంట్రాక్టలతో చర్చించి నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.

వెంకటసుబ్బమ్మ మృతి పట్ల గంగుల సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకురాలు వెంకటసుబ్బమ్మ (87) సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ యంయల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట ఎంపిపి వీరభద్రుడు,వైసీపీ నాయకులు మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,వెంకట రమణ,మనోహర్‌రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

మనబడి, నాడు నేడు పనులను త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎంఈఓ సుభాన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంఆర్సి భవనములో నాడు నేడు, జగనన్న విద్యా కానుకపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి నాడు నేడు పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక అందించడం జరుగుతుం దన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బెల్టులు, డిక్షనరీలు తప్పకుండా అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

మహానందిలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మహానంది

మహా నంది దేవస్థానంలో అభివృద్ధి పనులకు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. టిటిడి వారి ఆర్థిక సహాయ సహకారాలతో మొదటి విడతలో ఒక కోటి 60 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన వసతి గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యం కోసం పది వసతి గదులను నిర్మిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఇవి పూర్తయిన వెంటనే మరో మూడు కోట్లు టిటిడి వారు మహానంది దేవస్థానం నిధికి నిధులు జమ చేస్తారని, తరువాత మరో రెండు అంతస్తులతో మరో 20 గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఏఈ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

- నేడు ఎద్దుల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సుంకుల పరమేశ్వరి దేవాలయ ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మండల వైసీపీ నాయకులు జి.రామలింగేశ్వర రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వృషభాలకు నేడు బండలాగుడు పోటీలు : ఆలయ ప్రతిష్ట సందర్భంగా మంగళవారం నాడు వృషభలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీలలో విద్యార్థులుగా నిలిచిన చెట్లకు మొదటి బహుమతికి రూ.30 వేలు, రెండు, మూడు నాలుగు, ఐదు, ఆరో బహుమతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ. 4000 చొప్పున ప్రధానం చేయనున్నారు. రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారికి భోజన సదుపాయం కల్పించారు.

ప్రయివేటీకరణతోనే రైలు ప్రమాదం : సిపిఎం

- మృతులకు కొవ్వొత్తు వెలిగించి నివాళి

కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పిస్తున్న సిపిఎం కార్యకర్తలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్ర ప్రభుత్వం రైల్వేలో కొన్ని శాఖలు ప్రైవేట్ పరం చేయడంతోనే ఒడిశా రాష్ట్రంలో ఘోర రైలు ప్రమాదం చోటు జరిగిందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ అన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రయాణికులకు సంతాపం తెలియజేస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గౌడ్ సెంటర్ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ కానీ ఎరుగని ప్రమాదం నిన్నటి రోజున జరిగిందని ఎప్పుడూ కూడా మూడు రైళ్లు ఒకదానితో ఒకటి ఢీకొన్న సంఘటనలు చరిత్రలోనే లేవని తెలిపారు. మోడీ ప్రభుత్వం రైల్వే ప్రయాణికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైల్వేలో కొన్ని శాఖలు ప్రైవేట్ పరం చేయడంతోనే ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. వందే భారత రైలును ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వం మిగిలిన రైల్వేను నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఈ ప్రమాదానికి నరేంద్ర మోడీనే పూర్తిగా నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించాలని, రైలు ప్రమాదంలో మరణించిన వారికి ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎస్. స్వాములు, డి. రామ్ నాయక్, ఏ. సురేంద్ర, జి. నాగేశ్వరావు,నాయకులు వీరన్న, అంబయ్య, మహమ్మద్, ఏ. కిరణ్, టి. శివ కుమార్, శివుడు, రాజేష్, ప్రసాద్, సంపత్, నాగేంద్ర, స్వాములు, నారాయణ, బాష,, రవి తదితరులు పాల్గొన్నారు.

బీమా రంగంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలి

- కేంద్ర ఆర్థిక మంత్రికి ఎంపీ పోచా లేఖ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎంపీ పోచాకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎల్ఐసి సంఘం నాయకులు

బీమా రంగంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఎల్ఐసి, జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్లకు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎల్ఐసి సంఘాల నాయకులు రమేష్, రంగారావు, శేషగిరి, ఉమామహేశ్వర్ రెడ్డిలు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని కోరారు. సోమవారం ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ బీమా రంగంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఎల్ఐసి, జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్లకు ఇవ్వాలనే అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ పంపామన్నారు. 1995 నుండి ఎల్ఐసి, జిఐసిలలో రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నారని ఆయన లేఖలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన పద్ధతుల్లోనే బీమా రంగంలో కూడా పెన్షన్ స్కీం నడుస్తోందని, అయితే ఎల్ఐసి, జిఐసి యాజమాన్యాలే ఈ పెన్షన్ పథకాన్ని ప్రభుత్వంపై ఏ భారం లేకుండా సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, బ్యాంకులు, మరికొన్ని సంస్థల్లో ఇప్పటికే ఫ్యామిలీ పెన్షన్ 30 శాతం అమలు చేస్తున్నారని ఆర్థిక మంత్రికి గుర్తు చేశారు. 2019లో ఎల్ఐసి యాజమాన్యం, 2021లో జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల యాజమాన్యం 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్)కు సిఫారసు చేశాయని, అయినా ఇంతవరకు ఆమోదం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈలోగా దేశవ్యాప్తంగా చాలా మంది ఫ్యామిలీ పెన్షనర్లు కూడా చనిపోయారని అన్నారు. ఫ్యామిలీ పెన్షన్ పెంపుపై జాప్యం సబబు కాదని, వెంటనే దీనిపై సానుకూల నిర్ణయం కేంద్ర ఆర్థిక శాఖ తీసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశామన్నారు.

ప్రతి పేదోడికీ ఇల్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మున్సిపాలిటీలో ప్రతి పేదవాడికీ ఇల్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని, ఇంకా మిగిలిన వారికి త్వరలోనే ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాలలోని 9వ వార్డు శిల్పా నగర్‌లో 110వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్ దండె నాగమ్మ, వార్డు ఇంచార్జ్ దండె సుధాకర్, కోఆప్షన్ సభ్యులు పడగండ్ల సుబ్రహ్మణ్యం, ఆర్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. వార్డులో సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, కో ఆప్షన్ సభ్యులు దండె బుజ్జయ్య, మాభాష, అమీర్, దండె శ్రీను, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్దం శివరాం, గోపాల్, వైసిపి కౌన్సిలర్స్ కలాం భాష, సమ్మద్, విజయ భాస్కర్, మజీద్, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, నాయకులు, అధికారులు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

నూతన ఎంపిడిఒలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు నూతన ఎంపీడీవోగా డి.గోపికృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఫుల్ అడిషనల్ చార్జ్ ఎంపీడీవోగా పని చేస్తున్న సుమిత్రమ్మ పదోన్నతిపై ఎంపీడీవోగా వైఎస్ఆర్ జిల్లాకు బదిలీ కావడంతో కర్నూల్ కలెక్టరేట్లోని డ్వామ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న గోపికృష్ణ పదోన్నతిపై పాములపాడు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోకు ఏవో కర్ణ సాగర్, కార్యాలయ సిబ్బంది, మండల వైసీపీ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు ఎంపిడిఓగా పనిచేసిన సుమిత్రమ్మకు సన్మానం చేసి వీడుకోలు పలికారు. బాధ్యతలు చేపట్టిన గోపికృష్ణ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పథకాలను అర్హులకు అందే విధంగా అధికారుల, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

చాగలమర్రి : చాగలమర్రి ఎంపిడిఓగా మహబూబ్ దౌలా సోమవారం ఉద్యోగ భాధ్యతలు స్వీకరించారు.

ఆయన కోవేలకుంట్ల ఎంపిడిఓగా విధులు నిర్వర్తిస్తూ చాగలమర్రికి బదిలీపై వచ్చారు. చాగలమర్రి ఇంచార్జి ఎంపిడిఓగా పనిచేస్తున్న రుద్రవరం ఈఓపిఆర్డి భాగ్యలక్ష్మి పదోన్నతిపై వైయస్ఆర్ కడప జిల్లాకు ఎంపిడిఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా అందుబాటులో ఉండి అందరి సహకా రంతో మండలాన్ని అభివృద్ధిపరచి, అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు.

బేగరీలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కొత్తపల్లి

వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా స్మశానాల్లో గుంతలు తీస్తూ జీవిస్తున్న బేగరీలను ప్రభుత్వం గుర్తించి 45 సంవత్సరాలు దాటిన బేగరీలకు 5000 రూపాయలు పెన్షన్ ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని శివపురం, ముసలమడుగు, కొత్తపల్లి, గువ్వలకుంట్ల, దుద్యాల, నందికుంట, తదితర గ్రామాల్లో పంచాయతీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా స్మశానాల్లో గుంతలు తీసి జీవిస్తూ, కరోనా సమయంలో చనిపోయిన శవాలను సొంత మనుషులే దగ్గరకి రాని సందర్భాలలో బేగరీలు తమ ప్రాణాలకు తెగించి దహన సంస్కారాలు చేశారని వారిని ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు ఇచ్చి, రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన బేగరీలకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇచ్చి, ప్రతి గ్రామంలో స్మశానాల్లో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేగరీలు చిన్న చిన్నయ్య, దేవ సహాయం, శివన్న, రవి, జీవరత్నం, జయన్న, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బాయిదమ్మ భాయి సమీపాన సోమవారం చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం సుల్తానాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర మోటార్ సైకిల్‌పై నందికొట్కూరు మీద పగిడ్యాల మండలం పాలమర్రి గ్రామానికి బంధువుల ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో బాయిదమ్మ బావి సమీపాన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయలైన రాఘవేంద్రని స్థానికంగా ఉన్న ప్రజలు 108కి సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం 108లో వైద్యశాలకు తరలించారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు, గొడవలు చేస్తే చర్యలు ఉంటాయని ఎస్సై హుస్సేన్ బాష హెచ్చరించారు. సోమవారం మండలం లోని లింగాపురం, ఎదురుపాడు, గోకవరం గూడెంలలో గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. చెంచు గిరిజనులు చిన్నారులను చిన్నప్పటినుంచి విద్యలో రాణించే విధంగా చూసుకోవాలి అన్నారు. అప్పుడే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. పోలీసు సిబ్బంది ప్రసాద్ నాయక్, సుదర్శనం ఉన్నారు.

మద్దిలేటి స్వామి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవాలు ఈనెల 5 నుండి 8 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు సోమవారం తెలిపారు. మహోత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విమాన గోపురం శిఖర కలశ, ధ్వజస్తంభ ద్వారపాలక ప్రతిష్టలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. **ఆలయ నిర్మాణానికి విరాళ:** మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కుంచె సోడా మద్దిలేటి రెడ్డి, సతీమణి సుశీలమ్మ దంపతులు స్వామివారి ఆలయ నిర్మాణం కోసం రూ.1,01,016 విరాళంగా ఇఒ, చైర్మన్‌లకు అందజేరు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని పాఠశాలలకు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుండి విద్యార్థులకు టెస్ట్ బుక్స్ యూనిఫాం బెల్టులు, డిక్షనరీలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలు తెలిసిన వెంటనే విద్యార్థులకు అందరికీ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

గ్రంథాలయల్లోని పుస్తకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకో వాలని గ్రంథాలయ అధికారిని కె మద్దమ్మ అన్నారు. సోమవారం పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రంథాలయంలో ఎన్నో విలువైన పుస్తకాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, మత గ్రంథాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆళ్లగడ్డ: ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి..) ఎమ్మెల్యే శిల్పా సతీమణి నాగినిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డిఎస్పి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **డిఎంహెచ్ఒ కార్యాలయం ఆవరణలో :** జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలను నాటారు. ఎన్సీడీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మాధవి లత, ఎన్టిసిపీ సోషల్ వర్కర్ చిన్న వీరన్న, ఎన్జీవో ప్రతినిధులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **నంద్యాల :** స్థానిక రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామకృష్ణ విధ్య సంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. కళాశాల సంచాలకులు జి.హేమంత్ రెడ్డి నేతృత్వం వహించారు. సంస్థ యాజమాన్య కార్య నిర్వాహక అధ్యక్షులు అధిపతి జి.ప్రగతి రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై వివరించారు. అనంతరం కళాశాల వాణిజ్య విభాగాధిపతి శ్రావణి మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాసరచన, డ్రాయింగ్, లోగో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. **రుద్రవరం :** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రుద్రవరం అటవీ రేంజి అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీ క్షేత్ర అధికారి వారి కార్యాలయం ఆవరణంలో డిఎఫ్ఒ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు రుద్రవరం అటవీ క్షేత్రాధికారి సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, రాణిమ్మ, బీట్ ఆఫీసర్లు నరసింహారెడ్డి, ఖాన్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థులతో పర్యావరణ సంరక్షణకై ప్రతిజ్ఞ చేయించారు. కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ ఓబన్న పాల్గొన్నారు. అలాగే స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి అరుణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. **కొలిమిగుండ్ల :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో ఎస్ఐ మొక్కలు నాటారు. **ఆత్మకూర్ :** పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా ప్రజలందరూ ముందుకు రావాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ హాజరయ్యారు. ముందుగా ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ అలెన్ చాంగ్ తెరాన్ ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ఆర్ స్మృతివనంలో మొక్కలు నాటి పర్యావ రణంపై అటవీ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్ఒలు, పట్టాభి దొరస్వామి, రామకోటి, ఏకే ఖాన్, ఎఫ్ఎస్ఒలు శ్రీనివాసులు, శివ నాగయ్య, మక్బుల్, మద్దిలేటి, ఎఫ్‌బిఒలు, ఏబీవోలు, ప్రొటెక్షన్ వాచర్లు, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ తులసమ్మ,ఎంపిపి వీరభద్రుడులు అన్నారు. డిఎఫ్ఒ వినీత్ కుమార్, రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడు ఆదేశాల మేరకు ఫారెస్టర్ పెద్దన్న ఆధ్వర్యంలో ప్రపంచ పరావర్యణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో సర్పంచ్, ఎంపిపి,తహసిల్దార్ విజయ్ కుమార్,ఉపసర్పంచ్ సోహెల్‌లు మొక్కలను నాటారు. వైస్ ఎంపిపి రఫి, ఈఓ సుదర్శనరావు, ఎఫ్‌బిఓలు మదన్ గోపాల్,నాగేష్,సుభాష్,వైసిపి నాయకులు ఖాదర్ బాష, బ్రాందిన్, షబ్బీర్, షరీఫ్, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** మండలంలోని బిలకల గూడూరు గ్రామ సమీపంలో ఉన్న జిందాల్ సిమెంట్ పరిశ్రమ నందు ప్లాంట్ హెడ్ నవనీత్ చాహన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని పుష్కరించుకొని కార్మికులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిందాల్ సిమెంట్ యూనిట్ హెడ్ నవనీత్ చాహన్ మాట్లాడారు. అనంతరం బాలాజీ ఆలయం నందు రోడ్డుకు ఇరువైపులా సింగల్ విండో సొసైటీచైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పంచాయత్ కార్యదర్శి బాలకృష్ణ చేతుల మీదగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఇంచార్జ్ సంజయ్ శర్మ, ఎన్విరానే సిమెంట్ హెడ్ నరసింహారెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కె.బొల్లవరం గ్రామ సచివాలయం ఆవరణలో సర్పంచ్ అంజన్నమ్మ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు భూపాల్ రెడ్డి, ఈవోఆర్‌డి కాలిక్ బాషా మొక్కలు నాటారు.

'స్పందన' కరువు

ప్రజాశక్తి - కొత్తపల్లి

స్పందనలో పాల్గొన్న ముగ్గురు అధికారులు

మండల కేంద్రమైన కొత్తపల్లిలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి అధికారులు కరువయ్యారు. వచ్చిన అధికారులు రిజిస్టర్లలో సంతకాలు చేసి స్పందనలో కనిపించకపోవడం అధికారులు ఎక్కడ అని మండల ప్రజలు చర్చించుకుంటున్న సంఘటన చోటు చేసుకుంది. తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో మేరీ, హౌసింగ్ అధికారి మురళి తప్ప ఏ అధికారి కూడా కనిపించలేదు. వచ్చిన అధికారులు రిజిస్టర్లలో సంతకాలు చేసి వెళ్లిపోవడం వెనుక పనులు ఉన్నాయా లేక సంతకాలు చేసి వెళ్లిపోవాలన్న సంకల్పంతో వెళ్లిపోయారని స్పందనకు అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమం వద్ద ఉంటారని వచ్చిన ఫిర్యాదు దారులకు ఆశ అధికారులు లేకపోవడంతో నిరాశ మిగిలింది. ఇలా ఉంటే సమస్యలు పరిష్కారం ఎలా అవుతాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి రాబోవు రోజుల్లో స్పందన కార్యక్రమానికి పూర్తిస్థాయిలో అధికారులు పాల్గొని ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

భూముల విలువ పెంపుతో సామాన్యులకు భారం

- సిఐటియు కమిటీ

ప్రజాశక్తి -ప్యాపిలి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూముల మార్కెట్లను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సామాన్య, మధ్యతరగతి అదనపు భారం ప్రజలపై పడుతుం దని సిఐటియు ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ. చిన్న రెహమాన్ సిఐటియు డిప్యూటీ కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన నవరత్నాల అమలు కొరకు నిధులు సమీకరించుకోవడానికి ప్రజలపై భారం వేయడమే పనిగా పెట్టుకున్నదని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్దుబాటు పేరుతో కరెంటు వినియోగదారులపై ఇప్పటికే మూడుసార్లు భారాలు వేసి ప్రజల నడ్డి విరగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొంతమందికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలందరిపై భారాలు వేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యుత్తు సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, భూముల మార్కెట్ విలువను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నాగ పుల్లయ్య మృతి తీరని లోటు : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఆర్ఎస్ రంగాపురం టిడిపి నాయకుడు నాగ పుల్లయ్య మృతి పార్టీకి తీరని లోటు అని డోన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, బేతంచర్ల మండలం కన్వీనర్ ఉన్నాం ఎల్ల నాగయ్య అన్నారు. నాగ పుల్లయ్య అనారోగ్యంతో సోమవారం మరణించాడు. విషయం తెలుసుకునక్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఆర్ఎసన్ రంగాపురంకు వచ్చి నాగ పుల్లయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాయకులు రాధాకృష్ణ, లొడ్డ రామ్ మద్దయ్య, శేఖర్, గుడిసె మద్దిలేటి, నల్లాడి నివాళ్ల అర్పించారు.

నాగ పుల్లయ్య మృతదేహానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్య

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రియుడు మోసం చేశాడని ప్రియురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రాతకోట గ్రామానికి చెందిన వినోద్ కుమార్ కర్నూలుకు చెందిన పద్మావతి కర్నూలులోని మోటార్ సైకిల్ షోరూంలో పనిచేస్తున్నారు. పరిచయం పెరిగి 8 ఏళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. పెద్దలు వారి పెళ్లికి ఒప్పుకొని ఈనెల 9,10న వివాహానికి తేదీలు ఖరారు చేశారు. అయితే వినోద్ కుమార్ జూపాడుబంగ్లా మండలం భాస్కాపురం గ్రామానికి చెందిన మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రియురాలు పద్మావతి మనస్థాపానికి గురై కర్నూలులో ఆత్మహత్య చేసుకున్నది. కర్నూలులో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తున్నారు.

జల దీక్షను విరమించే ప్రసక్తే లేదు

ప్రజాశక్తి - నందికొట్కూరు

జూపాడు బంగ్లా మండలంలోని మండ్లెం, తంగడంచ భాస్కాపురం గ్రామాల పరిధిలో ఉన్న 5 వేల ఎకరాల మిట్ట భూములకు కృష్ణా జలాలు అందించే వరకు జల దీక్షను కొనసాగిస్తామని మహానంది సుధాకర్ తెలిపారు. కృష్ణా జలాలు ఎత్తిపోతల లిఫ్ట్ పెంచి తక్షణమే సాగునూరు అందించాలని మండ్లెం గ్రామ రైతులు చేపట్టిన జలదీక్ష సోమవారం 42వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తక్షణమే జిల్లా కలెక్టర్, సాగునీటి అధికారులు స్పందించి మండలం గ్రామ రైతాంగానికి లిఫ్ట్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్రిక్తం చేస్తామని చలో కలెక్టరేట్‌కు పిలుపునిసా మని హెచ్చరించారు. కార్య క్రమంలో నాగరాజు నాగరత్నం,శీను, తదితరులు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేతలు

IN THE COURT OF THE PRINICIPAL JENIOR CIVIL JUDGE :: NANDYAL ::
O.S. No. 861 / 2019

Vadlamanu Lakshmi Janardhana Reddy. … Plaintiff

V/s

Somula Siva Prasada Reddy. … Defendent

Defendent.
Somula Siva Prasada Reddy, Aged about 39 years, son of Rama Subba Reddy?, Hindu, Business, R/o. H.o.2-81,Gulladurthy Village, Koilakuntla Mandal,Nandyal Dist. …Defendent

SUIT SUMMONS TO DEFENDENT

Take notice that the Plaintiff has filed the above suit against you for recovery of amount of Rs.2,00,000/- due under promissory note, and the said case posted to 26-06-2023 for making your appearance. In case of default in appearing on 26-06-2023 at 10:30 a.m. before the Hon'ble above court, the suit will be decidi.

(By Court Orders)

వాయిదా తేదీ : 26-06-2023

ఇట్లు

V. MADHUSUDHAN REDDY,
V. BALU NAIK,
Advocates,
Nandyal.